క్లుప్తంగా

ముగిసిన వెంకయ్య స్వామి ఆరాధన



గొలగమూడి వెంకయ్య స్వామి పూజలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక సంతపేటలోని వెంకయ్య స్వామి ఆలయంలో గురువారం శాస్త్రోక్తంగా అర్చక స్వాములు పూజలు నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు ఉదయం సుగంధ పరిమళ ద్రవ్యాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజ్య భరద్వాజ మాస్టర్ పుత్రిక ఆడిదం వేదవతి గురు చరిత్ర పారాయణ ప్రవచనం చేశారు. నిర్వాహకులు సాంబశివరావు ఆవుల బ్రహ్మయ్య పర్యవేక్షణలో జరిగింది.

రోడ్డుకూ లేదు రక్షణ



ఆర్‌అండ్‌బీ రోడ్డు వెంబడి మట్టిని తరలిస్తున్న కబ్జాదారులు

ఈతముక్కల (కొత్తపట్నం): ఆర్‌అండ్‌బీ రోడ్డు దెబ్బతినే విధంగా అంచున బంకమట్టిని కబ్జా చేస్తున్నారు. అధికారులు, గ్రామస్తులు వెళ్లి నిలుపదల చేయాలని అడ్డుపడితే లెక్కచేయకుండా ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. సూరారెడ్డి పాలెం-ఈతముక్కల మధ్యలో ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. రోడ్డు అంచున కాలువ ఉంది. ఆ కాలువను లోతుగా చేస్తూ మట్టిని తోలుతున్నారు. వర్షాలు వచ్చినప్పుడు తవ్విన గోతుల్లో ప్రజలు, పశువులు పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు వీఆర్వోకు ఫిర్యాదు చేశారు. వీఆర్వో శంకరరావు గురువారం సంఘటన స్థలానికి చేరుకుని మట్టి తీయటం వలన రాబోయే రోజుల్లో రోడ్డు దెబ్బతింటుందని వెంటనే నిలుపదల చేయాలని కోరారు. ఇక్కడ మట్టిని తీయటానికి మీకు అనుమతులు ఎవరు ఇచ్చారని, అనుమతులు తీసుకోకుండా ఎలా తీస్తారని ప్రశ్నించారు. కొద్ది సేపు నిలుపదల చేసి కబ్జాదారులు అధికారులు వెళ్లిన తరవాత యథావిధంగా మట్టిని తరలించారు.

రైల్వే టీసీ, సీఆర్‌పీఎఫ్ ఉద్యోగాలకు ఎంపిక

మార్కాపురం టౌన్: సికింద్రాబాద్ రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో పట్టణానికి చెందిన యాలం సాయికిరణ్ ఎంపిక య్యారు. సీనియర్ కమర్షియల్ కం టిక్కెట్ క్లర్క్ పోస్టుకు సాయికిరణ్ ఎంపిక కావడంపై తల్లిదండ్రులతోపాటు శిక్షణ ఇచ్చిన నేతాజీ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ కె.కాశిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అలాగే స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ప్రకటించిన ఫలితాల్లో మార్కాపురం పట్టణానికి చెందిన శిద్దా అనిత, కొర్రా శ్రీరాములు నాయక్ సీఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లుగా ఎంపికై నట్లు కాశిరెడ్డి తెలిపారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ కోతలు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని నాగంబొట్లపాలెం, బొద్దుకూరపాడు, లక్కవరం గ్రామాల సబ్‌స్టేషన్‌ల పరిధిలో మూడో ఫేస్ విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ వీరబ్రహ్మం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆయా గ్రామాల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి నాలుగు గంటల వరకు ఈ కోత ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇసుక డంప్ సీజ్

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు వద్ద అక్రమంగా ఉన్న ఇసుక డంప్‌ను గురువారం సాయంత్రం తహసీల్దార్ ఎండీ నయీమ్ సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక నిల్వ చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు పసుపుగల్లులో ఓ ప్రైవేటు స్థలంలో నిల్వ చేసి ఉన్న ఇసుకను సీజ్ చేశారు. ఆయన వెంట వీఆర్వో సుశీలారాణి ఉన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్, ఆహా క్యాంటీన్ ఏర్పాటు



మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అంకులు, కమిషనర్ ఫజులుల్లా



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు

చీమకుర్తి: మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్, ఆహా క్యాంటీన్‌ను మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, కమిషనర్ షేక్ ఫజులుల్లా గురువారం ప్రారంభించారు. చీమకుర్తిలోని మెప్మా కార్యాలయ సిబ్బంది, సంఘ సభ్యులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సంఘంలోని సభ్యులు ప్రభుత్వం ఇస్తున్న రుణాల సహకారంతో తయారు చేసిన ఉత్పత్తుల విక్రయాలకు అర్బన్ మార్కెట్ దోహదపడుతుందని చైర్మన్, కమిషనర్ తెలిపారు. సంఘంలోని సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు 28 స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రదర్శించారు. దాంతో పాటు రూ.30కే పట్టణంలోని పేద ప్రజలకు పులిహోర, పెరుగన్నం, వెజిటబుల్ బిర్యాని, సాంబార్ అన్నంను మెప్మా సభ్యుల ఆధ్వర్యంలో అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ఆహా క్యాంటీన్‌లో తక్కువ ధరలో రూ.30కు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోపురపు రాజ్యలక్ష్మి చంద్ర, మెప్మా సిబ్బంది జయకుమార్, సంపత్‌కుమార్, జగదీష్, చిరంజీవి, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయోత్సవ సదస్సు



కె.పల్లెపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు



చంద్రయాన్-3 విజయోత్సవాల్లో మహిళాభ్యుదయ సమితి సభ్యులు

ఒంగోలు మెట్రో: ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్‌లోని శక్తి సదన్‌లో చంద్రయాన్-3 విజయోత్సవ సదస్సు జరిగింది. సమితి అధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించారు. ఎందరో శాస్త్రవేత్తల మేధో మదనం కృషి ఈ దేశానికి కీర్తి తెచ్చి పెట్టిందని, యువతకు ఇది మార్గదర్శకం కావాలని సమితి కోశాధికారి బీరం అరుణ అన్నారు. కృషి, పట్టుదల ఉంటే సాధించలేని ఏదైనా లేదని ఈ సంఘటన రుజువు చేసిందని సమితి డైరెక్టర్ కె.శాంతిలత అన్నారు. కేక్ కట్ చేసి ఆనందోత్సవాలతో చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలను జరుపుకున్నారు. సీహెచ్ కనకదుర్గ, గుంటూరు శ్రీదేవి, వేముల సుశీల పాల్గొన్నారు.

శాస్త్ర పరిశోధనలో దేశం ముందంజ

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): శాస్త్ర పరిశోధన రంగంలో ప్రపంచంలో వివిధ దేశాలు కంటే ముందు ఉంటుందని కె.పల్లెపాలెం సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు అన్నారు. కె.పల్లెపాలెం పంచాయతీ పరిధిలో చంద్రయాన్-3 విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆనందరావు ఆధ్వర్యంలో గురువారం మూడు ప్రాథమిక పాఠశాలల పరిధిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సచివాలయం నుంచి బస్టాండ్, బీచ్ ప్రాంతం అంతా తిరిగి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సచివాలయం పాఠశాల ఆవరణంలో ఆనందరావు మాట్లాడుతూ సురక్షితంగా చంద్రుని దగ్గరకు చేరుకున్న చంద్రయాన్-3 ప్రపంచ దేశాలు సహితం భారత దేశం వైపు చూస్తున్నాయన్నారు. చరిత్రలో మర్చిపోని సంఘటన మనం చూస్తున్నామన్నారు. అంతరిక్షంలో మువ్వెన్నెల జెండా వెగరవేయటం అభినందన నీయమని తెలిపారు. చంద్రుని దగ్గర విశేషాలు ఎన్నో విషయాలు, వింతలు తెలుసుకోవచ్చున్నారు. పిన్ని బంగారయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పెద్దసింగు వెంకట్రావు, హెచ్‌ఎంలు మస్తాన్, ప్రసాద్, తిరుమలబాబు, పంచాయతీ కార్యదర్శి మణిదీప్, నాంచార్లు, వర్దన్ పాల్గొన్నారు.

రైజ్ కాలేజీలో..

ఒంగోలు: స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో చంద్రయాన్ విజయోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. కళాశాల సెక్రెటరీ శిద్దా హనుమంతరావు, ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత్ ప్రపంచంలోనే ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏవీ భాస్కరరావు, ప్రిన్సిపాళ్లు డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం, జేవీ రమేష్‌బాబు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు తదితరులు జాతీయ పతాకాలు చేతబట్టి పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధి అవసరం



మాట్లాడుతున్న ఒంగోలు ఎంపీడీవో పి.అజిత, డీపీఎంలు, సమాఖ్య అధ్యక్షురాలు సంధ్యారాణి

ఒంగోలు రూరల్: మహిళలు ఆర్థికంగా బలోపేతమైతేనే కుటుంబ వ్యవస్థతో పాటు ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని ఒంగోలు ఎంపీడీవో పి.అజిత అన్నారు. చిన్నగా పొదుపు అలవాటు చేసుకుని క్రమంగా వ్యాపారాల వైపు మళ్లి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని మరికొంత మందికి ఆర్థిక సాయంతో పాటు ఉపాధి కల్పించడం గ్రూపు సంఘాల లక్ష్యమని ఎంపీడీవో అన్నారు. డీఆర్‌డీఏ డీపీఎం నరసింహారావు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు పొదుపు చేసుకుని మరికొంత మందికి ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. డీపీఎం సుబ్బారావు మాట్లాడుతూ రుణాలు పొంది సక్రమంగా బ్యాంకుల్లో తిరికి చెల్లించడం ద్వారా బ్యాంకులో పరపతి పెరుగుతుందని తెలిపారు. సమాఖ్య ఆర్థిక నివేదికలు, ప్రాజెక్ట్ నివేధికలు చదివి వినిపించగా సభ్యులు ఆమోదం తెలిపారు. ప్రస్తుతం మండల సమాఖ్య మహిళా అధ్యక్షురాలు సంధ్యారాణి కార్యవర్గం పదవీకాలం ముగిసినట్లు ఏపీఎం గోపీనాథ్ తెలిపారు. అధ్యక్షురాలిగా పాలేటి ప్రియాంక, ఉపాధ్యక్షురాలిగా నల్లూరి అరుణ, కార్యదర్శిగా బక్కమంతుల రమాదేవి, ఉపకార్యదర్శిగా టంగుటూరి జయలక్ష్మి, కోశాధికారిగా వాకా మల్లీశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిచే డీపీఎంలు నరసింహారావు, సుబ్బారావు, ఏపీఎం గోపీనాథ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఒంగోలు ఎంపీడీవో పి.అజితను ఘనంగా సన్మానించారు. ఒంగోలు ఏపీఎం గోపీనాథ్, ఎల్‌సీ జి.వెంకటసుబ్బయ్య, సీసీలు ఎన్.చెంచమ్మ, ఎన్‌వీ రమణయ్య, అకౌంటెంట్ సామ్రాజ్యం పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ

చీమకుర్తి: సంతనూతలపాడు మండలంలోని మంగమూరు గ్రామంలో శుక్రవారం ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే టీజేఆర్ కార్యాలయం నుంచి గురువారం ప్రకటన విడుదల చేశారు. సచివాలయ కాంప్లెక్స్‌ను కూడా ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: పలు డిగ్రీ కోర్సుల్లో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 1 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అడ్మిషన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.ధనుంజయరావు, సెల్ నెంబర్ 94903 82802 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

గ్రానైట్ అక్రమ రవాణాను అరికట్టండి

చీమకుర్తి: మండలంలోని రామతీర్థం పరిధిలో గ్రానైట్ క్వారీల నుంచి అక్రమంగా రాళ్లు తరలిస్తున్నారని చీమకుర్తికి చెందిన గుండా శ్రీనివాసరావు గురువారం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ ఎం.ఉషను కలిసి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గ్రానైట్ యజమానులు గండికొడుతున్నారని ఆరోపించారు.

మౌలిక వసతులు కల్పించండి



నగరాభివృద్ధి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మారెళ్ల

ఒంగోలు టౌన్: నగరంలోని స్మశాన వాటికలలో మౌలిక వసతులను కల్పించాలని, ఒంగోలు ఆర్టీసీ బస్టాండు పక్కన గల శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన గ్యాస్ క్రిమటోరియం వెంటనే ప్రారంభించాలని ఒంగోలు నగరాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని స్మశానాలకు ప్రహరీ గోడలు, దహనం కోసం ప్లాట్‌ఫాంలు, నీటి వసతి లేక పోవడంతో ఇబ్బందులకు గురి అవుతున్నారని కమిటీ అధ్యక్షుడు మరెళ్ల సుబ్బారావు తెలిపారు. శ్మశానాల్లో విద్యుత్ దహనవాటికలను నిర్మించాలని, అనాథ శవాలను ఉచితంగా దహనం చేయాలని విజ్ఞప్తి చేశారు. జి.రమేష్ కోరారు. వీకే రావు, బత్తుల వెంకారెడ్డి, యస్‌డీ హుసేన్, కొల్లా మధు, ముసలారెడ్డి, తన్నీరు రమేష్, అత్తింటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్ఎస్ ట్యాంకు అభివృద్ధి పనుల పరిశీలన



మామిడిపాలెం ఎస్ఎస్ ట్యాంకు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఒనుడా చైర్మన్ శింగరాజు మీనా కుమారి వెంకట్రావు, యువనేత బాలినేని ప్రణీత్ రెడ్డి తదితరులు

ఒంగోలు సబర్బన్: నగరంలోని మామిడిపాలెం ఎస్ఎస్ ట్యాంకు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒనుడా) చైర్మన్ శింగరాజు మీనా కుమారి వెంకట్రావు పరిశీలించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, యువనేత బాలినేని ప్రణీత్ రెడ్డితో కలిసి రూ.1.70 కోట్లతో జరుగుతున్న చెరువు కట్ట అభివృద్ధితో పాటు పార్కు పనుల గురించి ఆరా తీశారు. వాకర్స్‌కు ఆహ్లాదకరంగా ఉండే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. బాలినేని ప్రణీత్ రెడ్డి కొన్ని సూచనలు చేశారని వాటిని పాటిస్తామని ఒనుడా మీనా కుమారి వెంకట్రావు పేర్కొన్నారు. గద్దలగుంట కార్పొరేటర్ తాడి కృష్ణలత కూడా ఉన్నారు.

జేఎన్‌టీయూ బెస్ట్ కాలేజీగా క్విస్



ఉత్తమ కళాశాల గుర్తింపు పత్రం అందుకుంటున్న క్విస్ కాలేజీ ప్రిన్సిపాల్ హనుమంతరావు

ఒంగోలు: జేఎన్‌టీయూ బెస్ట్ కాలేజీగా క్విస్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ ఎంపికై ంది. జేఎన్‌టీయూ కాకినాడ 15వ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా కాకినాడలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ కళాశాలగా గుర్తింపు పత్రాన్ని క్విస్ కాలేజీ ప్రిన్సిపాల్ హనుమంతరావు అందుకున్నారు. యూనివర్శిటీ పరిధిలో నాక్ ఏ+, ఏ++ అర్హత కలిగిన 23 ఇంజినీరింగ్ అండ్ ఫార్మసీ కళాశాలలకు ఉత్తమ ప్రదర్శన చేసిన కాలేజీలుగా అవార్డులను అందించారు. క్విస్ కాలేజీకి ఉన్న నాక్ ఏ+ ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకుని ఉత్తమ కళాశాల గుర్తింపును ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ హేమచంద్రారెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రసాదరాజు చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉందని క్విస్ కాలేజీ చైర్మన్ డాక్టర్ ఎన్.సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ గాయత్రి పేర్కొన్నారు.

చిన్నారులకు ఐరన్ మాత్రల పంపిణీ



పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వినీల

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రామంలో క్వార్టర్స్‌లో ఉన్న విద్యార్థులకు డాక్టర్ వినీల గురువారం ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా గుండ్లాపల్లి గ్రామంలో క్యాంప్ నిర్వహించారు. గుండ్లాపల్లి క్వార్టర్స్ వద్ద ఉన్న డీపీఏపీ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. తినడానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులను పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాలలో భోజనం ఎలా ఉందో పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేసి మింగించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ కీర్తి, ఏఎన్ఎం రంజాన్‌బీ, అంగన్‌వాడీ వర్కర్ శ్రీదేవి పాల్గొన్నారు.

నగదు విషయమై ఇరువర్గాల ఘర్షణ

మార్కాపురం రూరల్: నగదు విషయంలో మార్కాపురం మండలం కొట్టాలపల్లి గ్రామానికి చెందిన కొమర చిన్న వెంకటేశ్వర్లుపై అదే గ్రామానికి చెందిన కొమరా అల్లూరయ్య, ఆయన కుమారులు నగదు విషయమై గురువారం దాడి చేశారు. ఈమేరకు మార్కాపురం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాడిలో గాయపడిన వెంకటేశ్వర్లు మార్కాపురం జిల్లా వైద్యశాలలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. వివరాల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపారు.

జెడ్పీ హైస్కూల్‌కు కంప్యూటర్ అందజేత



కంప్యూటర్ అందిస్తున్న డాక్టర్ జవహర్, బదరీనారాయణ

చీమకుర్తి: మండలంలోని నాయుడుపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ బీ జవహర్, చలువాది బదరీనారాయణ ఆర్థిక సహకారంతో గురువారం కంప్యూటర్, ప్రింటర్ అందించారు. పాఠశాలలో హెచ్‌ఎం కే సంపూర్ణ, ఉపాధ్యాయుడు బొంతా ఏసుదాస్‌లకు అందించి విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చలువాది రమేష్, నూనె హేమసుందర్, అంజిరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

NOTICE
IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT & SESSIONS JUDGE AT SIRCILLA
O.P. No. 2 of 2023

Between:
Gunturu @Budamguntla Ravali ... Petitioner
And
Gunturu Pradeep ... Respondent

To
Gunturu Pradeep, S/o. Kotaiah, Aged 25 Years, Occ: Suthari/Mason, R/o. H.No. 3-996, Chirrikurapadu, V/o. Zarugumalli Mandal of Prakasham District, presently residing at his brother's house, C/o. gunturu Praveen, H.No. 2-38, Yerajula v/o. Tanguturu Mandal of Prakasham District.

Whereas the above named petitioner filed above referred O.P. for dissolution of her marriage with the respondent by way of decree of divorce.

Take notice that, the above O.P. is posted on: 18-09-2023 at 10.30 A.M. for the appearance of you the respondent in person or through duly authorized Counsel, before this Hon'ble Court, failing which the matter would be adjudged in your absence.

// BY ORDER OF THE COURT //
Sd- GUNTUKA BHUVANESHWAR, Advocate SIRCILLA, Cell: 9290732409

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25431

ఒంగోలు డివిజన్

9010224456 90103 57744
90102 02762 90102 02856

Office mail : sakshiongads@gmail.com

సమన్వయంతో పనిచేయాలి



సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని నాగులుప్పలపాడు ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చేపడుతున్న మంచి పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారం అందించాలన్నారు. సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమయపాలన పాటించాలని తెలిపారు. అనంతరం పలు శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్షలో ప్రజాప్రతినిధులు పలు సమస్యలు లేవనెత్తారు. వ్యవసాయ శాఖపై నిర్వహించిన సమీక్షలో.. గతేడాది మిరప పంట రైతులు నష్టపోయిన క్రమంలో తమ గ్రామానికి చెందిన రైతులను పరిహారం జాబితాలో చేర్చలేదని కండ్లగుంట సర్పంచ్ పల్లెర్ల అంజిరెడ్డి తెలిపారు. మరోమారు ఇలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా చూస్తామని వ్యవసాయాధికారి వెంకట్రావు వివరణ ఇచ్చారు. అనంతరం విద్యుత్ శాఖపై జరిగిన సమీక్షలో మండలంలోని కనపర్తి, ఉప్పుగుండూరు, చీర్వానుప్పలపాడు గ్రామాల్లో పలు విద్యుత్ సమస్యలను ప్రజాప్రతినిధులు లేవనెత్తారు. ఈ విద్యా సంవత్సరంలో మండలంలో జరుగుతున్న నాడు-నేడు పాఠశాల అభివృద్ధి పనులు, విద్యా సంవత్సరంలో పిల్లల అడ్మిషన్ల గురించి ఎంఈవో వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ యాదాల రత్నభారతి, ఎంపీడీవో జయమణి, తహసీల్దార్ సుజన్‌కుమార్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నర్సరీల్లో రికార్డులు సక్రమంగా ఉండాలి

- ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష

నాగులుప్పలపాడు: రైతులకు నాణ్యమైన పంట ఉత్పత్తులు అందించడానికి నర్సరీలు ప్రమాణాలు పాటించాలని ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష స్పష్టం చేశారు. మండలంలోని చదలవాడ గ్రామంలో నిర్వహిస్తున్న నర్సరీని గురువారం ఆమె పరిశీలించారు. రైతులకు నారు అందించే విషయంలో నియమ నిబంధనలు పాటించడంతో పాటు రైతులకు తగు రసీదులు కూడా ఇవ్వాలని ఆదేశించారు. రికార్డులన్నీ సక్రమంగా ఉండాలని సూచించారు. నర్సరీలో నారు పెంచే క్రమంలో తగు మోతాదులో మాత్రమే మందులు పిచికారీ చేయాలని చెప్పారు.

